
సాక్షి
వరంగల్
శనివారం | 31 | మే | 2025



రేపు టీజీ ఎడ్‌సెట్

రాష్ట్రంలో బీఈడీ కళాశాలల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు టీజీఎడ్ సెట్ - 25ను జూన్ 1న కాకతీయ యూనివర్సిటీ నిర్వహించనుంది. - 10లో▸



బోడకాకర సాగుతో నికర ఆదాయం

విశిష్ట ఔషధ గుణాలు, పోషక విలువలు ఉన్న బోడకాకర సాగుతో నికర ఆదాయం వస్తుందని ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి మరియన్న అన్నారు. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.5^0 / 28.3^0

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అవతరణ వేడుకలకు అతిథులు వీరే!

వరంగల్‌కు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



సాక్షిప్రతినిధి, వరంగల్: జూన్ 2 ఉదయం 10 గంటలకు తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథుల జాబితాను శుక్రవారం ప్రకటించింది. హనుమకొండ జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించనున్నారు. వరంగల్‌లో రాష్ట్ర రెవెన్యూశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ములుగులో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. అదే విధంగా జయశంకర్ భూపాలపల్లిలో టీజీఎఫ్‌డీసీ చైర్మన్ పోదెం వీరయ్య, మహబూబాబాద్‌లో ప్రభుత్వ విప్ జె.రాంచంద్రునాయక్, జనగామలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి జిల్లాకు చెందిన మంత్రులు, ప్రముఖులు తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించాలని, ఆ తర్వాత అతిథులు జాతీయ జెండాను ఆవిష్కరించాలని పేర్కొన్నారు.

నగరాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ఖిలా వరంగల్: నగరాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్ 19వ డివిజన్ వివేకానంద కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్లు, డ్రెయినేజీ పనులు, 41వ డివిజన్ ప్రతాప్‌నగర్ ఉర్సు కరీమాబాద్‌లో రూ.34 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్యశారద, స్థానిక కార్పొరేటర్లతో కలిసి మంత్రి సురేఖ వేర్వేరుగా శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని, పేదల కాలనీల్లో ప్రధాన సమస్యలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, నాయకులు నవీన్‌రాజ్, కేడల పద్మ, ట్రాన్స్‌జెండర్ సవరం రంజిత తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

సంగెం: మండల కేంద్రంలోని గ్రామీణ కుటుంబ సంక్షేమ కేంద్రాన్ని శుక్రవారం తెలంగాణ స్వస్థ ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సందర్శించింది. ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా మెరుగైన, ఉన్నతస్థాయి వైద్యానికి కావాల్సిన సౌకర్యాలను పరిశీలించి నివేదిక తయారు చేసి అందజేస్తామని బృందం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ క్వాలిటీ మేనేజర్ శ్రీనివాస్, వైద్యాధికారి వంశీకృష్ణ, డీపీఎంయూ అర్చన, డాక్టర్ క్రాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో మార్పుపై దృష్టిసారించాలి



విద్యారణ్యపురి: పాఠశాలల్లో మార్పుపై హెచ్‌ఎంలు దృష్టిసారించాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సూచించారు. తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జిల్లాలోని హెచ్‌ఎంలకు ఐదురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు సమావేశంలో సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. డీఈఓ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచే దిశగా బడిబాట కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు సాంకేతికతను ఉపయోగించి విద్యాబోధన చేయాలని చెప్పారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజ, రిసోర్స్ పర్సన్లు డాక్టర్ కట్ల శ్రీనివాస్, రవీందర్, మోహన్‌రావు, మహేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రిసోర్స్ పర్సన్లను సన్మానించారు.

పుస్తకం లేకుండా పాఠం!

కేయూ దూరవిద్య కోర్సుల్లో ముద్రణకు నోచని పుస్తకాలు

- అరకొరగా అందజేత.. మిగతావి పీడీఎఫ్ రూపంలో విద్యార్థులకు..
- అస్తవ్యస్తంగా సెమిస్టర్ విధానం.. ఆలస్యంగా పరీక్షల నిర్వహణ..
- రోజురోజుకూ తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి దూరవిద్య కేంద్రంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) డిగ్రీ, పీజీ తదితర కోర్సులకు ఒకప్పుడు బాగా డిమాండ్ ఉండేది. కానీ, కొన్నేళ్లుగా వీటిలో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించకపోవడం, తరగతులు, పరీక్షలు నిర్ణీతసమయంలో ఉండకపోవటం, పరీక్షలు రాశాక ఫలితాలు ఎప్పుడు వస్తాయో నిరీక్షించాల్సిన పరిస్థితులతో అసలెందుకు చేరామో అని విద్యార్థులు ఆవేదన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కొత్తగా చేరేవారి సంఖ్య సైతం తగ్గిపోతోంది. యూనివర్సిటీ యూజీసీ డెబ్ నిబంధనల ప్రకారం ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలోని విద్యార్థులకు దూరవిద్య కేంద్రంలో అడ్మిషన్లు కల్పించాల్సి ఉంటుంది. డిగ్రీ, పీజీ కోర్సుల్లో 2023- 24 విద్యాసంవత్సరంనుంచి సెమిస్టర్ సిస్టమ్ ప్రవేశపెట్టారు. అన్ని కోర్సులు కలిపి 5,518మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. వీరికి సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించలేకపోయారు. ఆలస్యంగా అరకొరగానే పుస్తకాలు ఇచ్చారు.

ముద్రించని మెటీరియల్..

పీజీ సైన్స్ కోర్సుల్లో ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టులు ఒక సెమిస్టర్‌కు మొత్తంగా 21 పాఠ్యపుస్తకాలు ఉంటాయి. వివిధ సబ్జెక్టులకు సంబంధించి 10 పుస్తకాలను సంబంధిత అధ్యాపకులతో రాయించారు. ఈ ప్రక్రియ కూడా ఆలస్యమవడంతో పరీక్షలకు కొన్నిరోజుల ముందు ముద్రించి ఇచ్చారు. మిగతా 11 పాఠ్యపుస్తకాల్లో 8 పుస్తకాలు రాయించారు. కానీ, పుస్తకరూపంలో ముద్రించడం లేదు. అయినప్పటికీ ఈ ఏడాది జనవరిలో పీజీ సైన్స్‌కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. కొన్ని సబ్జెక్టుల స్టడీ మెటీరియల్‌ను పీడీఎఫ్‌లో విద్యార్థుల మొబైల్స్‌కు పంపారు. పీజీ ఆర్ట్స్, సోషల్ సైన్సెస్ కోర్సుల్లో కూడా మొదటి సెమిస్టర్‌కు పాఠ్యపుస్తకాలు కొన్నింటిని మాత్రమే ఇచ్చి, మిగతావి పీడీఎఫ్ రూపంలో అందించారు. సైన్స్ పరీక్షలు నిర్వహించిన నెలరోజుల తరువాత ఈ పరీక్షలు నిర్వహించారు.

రెండో సెమిస్టర్‌కు పుస్తకాలే లేవు..

డిగ్రీ, పీజీ కోర్సుల్లో మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. డిగ్రీ పరీక్షల ఫలితాలు రావాల్సింది. పీజీ కోర్సుల్లో ఎమ్మెస్సీ బాటనీ, ఫిజిక్స్ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదల చేశారు. మిగతా సైన్స్ కోర్సుల సబ్జెక్టుల పరీక్షల ఫలితాలు రావాల్సింది. 2023-24లో మొదటి సెమిస్టర్లలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ప్రస్తుతం మూడో సెమిస్టర్‌లో ఉండాలి కానీ, ఇప్పటివరకు వారికి సెకండ్ సెమిస్టర్ తరగతులకు నిర్వహించకపోగా.. పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఇవ్వలేదు. ప్రధానంగా ఇయర్ వైజ్ పద్ధతి నుంచి సెమిస్టర్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టాక సెమిస్టర్ సిస్టమ్‌లో పుస్తకాలు రాయించాల్సి ఉంటుంది. కానీ, అలా చేయకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు.

పాఠ్యపుస్తకాలు రాయించడం.. వాటిని ముద్రించడంలో యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. కొన్నినెలల క్రితమే యూనివర్సిటీ అధికారులు పాఠ్యపుస్తకాల ముద్రణకు టెండర్ నిర్వహించగా.. హనుమకొండకు చెందిన ఓ ప్రింటర్ కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. అగ్రిమెంట్ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు పుస్తకాల ముద్రణకు ఆర్డర్ ఇవ్వలేదు. కేయూ పాలకమండలి సమావేశంలో ఫైనాన్షియల్ అప్రూవల్ కోసం పెట్టాకే పుస్తకాలను ముద్రణకు ఇస్తారని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది.

ముద్రణకు టెండర్ ప్రక్రియలో జాప్యం..

ప్రతి ఆరునెలలకో సెమిస్టర్..

ప్రతి ఆరునెలలకో సెమిస్టర్ పూర్తికావాల్సి ఉండగా.. ఏడాది దాటిపోయాకే మొదటి సెమిస్టర్ పరీక్షను నిర్వహిస్తున్నారు. పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసిన విద్యార్థులు రెండో సెమిస్టర్ ఎప్పుడు ఉంటుంది.. పుస్తకాలు ఎప్పుడిస్తారనే సమాచారం కోసం దూరవిద్యకేంద్రంలోగానీ, ఫోన్ ద్వారా కోరితే సరైన సమాధానం చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. ప్రధానంగా ఉద్యోగస్తులు ఎక్కువగా ప్రమోషన్లు, తదితర అవసరాల నిమిత్తం దూరవిద్య కోర్సుల్లో చేరుతారు. కానీ, పరీక్షల నిర్వహణ, ఫలితాల ఆలస్యంతో తాము నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

మొదటి సెమిస్టర్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి

డిగ్రీ, పీజీ తదితర కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో మొదటి సెమిస్టర్లకు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఒక బ్యాచ్‌కి గత ఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లో, మరో బ్యాచ్‌కు ఈఏడాది జనవరి-మార్చి వరకు అడ్మిషన్లు కల్పించారు. ఈరెండు బ్యాచ్‌లను ఒకే విద్యాసంవత్సరం కిందికే పరిగణిస్తారు. అన్నికోర్సులు కలిపి 4,498 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరిలో కొందరికి మాత్రమే పుస్తకాలు ఇచ్చారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ సత్యశారద



ఖానాపురం: రాగంపేటలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఖానాపురం/నర్సంపేట రూరల్/దుగ్గొండి: ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. ఖానాపురం మండలంలోని రాగంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి వివరాలు సేకరించి, ధాన్యం తేమశాతాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని తూర్పాల పట్టుకుంటే తేమశాతం తగ్గిపోయే అవకాశం ఉంటుందన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటిస్తూ విక్రయించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, ఇందులో నర్సంపేట నియోజకవర్గంలోనే 15 వేల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. వర్షాలు పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో నర్సంపేట రూరల్ పరిధిలోని రాజుపేటలో హరి రైస్ మిల్, నర్సంపేట పట్టణంలని ద్వారకపేట శివారు గోపికృష్ణ రైస్‌మిల్, దుగ్గొండి మండలంలోని చలపర్తి గ్రామంలో వినాయక రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కోతల పేరుతో దిగుమతులు ఆలస్యం చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, డీసీఓ నీరజ, డీఎం సంధ్యారాణి, డీసీఎస్‌ఓ కిష్టయ్య, ఆర్డీఓ ఉమారాణి, నర్సంపేట తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, రెవెన్యూ, వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 3 నుంచి భూభారతి దరఖాస్తుల స్వీకరణ

న్యూశాయంపేట : జిల్లాలో జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి భూ భారతి పథకంపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, రేషన్ కార్డుల మంజూరిపై సంబంధిత శాఖ అధికారులతో జిల్లా కలెక్టరేట్‌లో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పథకంలో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు న్యాయం చేయాలని సూచించారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు నెల రోజుల్లో పూర్తి కావాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండో విడత అర్హులైన పేదలను ఎంపిక చేయాలని ఆదేశించారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ఆమోదం పొందిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను స్థానిక ఎమ్మెల్యేల ఆమోదంతో తక్షణమే పంపిణీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జూన్ 6 వరకు అందించేందుకు సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీఓలు కృషి చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఈడీ ఎస్సీ కార్పొరేషన్ అధికారి సురేష్ ఆదేశించారు. రేషన్ కార్డు మంజూరిలో భాగంగా ప్రజాపాలన కౌంటర్ల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు, మీసేవ కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులను సంబంధిత మండల తహసీల్దార్ల ద్వారా ఎంక్వైయిరీ చేసి అర్హత మేరకు రేషన్ కార్డులు మంజూరి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి, డీఆర్ఓ విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- నర్సంపేట ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఏసీపీ రవీందర్‌రెడ్డి
- నెక్కొండలోని ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

నెక్కొండ: ఖరీఫ్ ప్రారంభం కాకముందే మండలంలో విత్తన షాపులు, రికార్డులను ఇటు వ్యవసాయ శాఖ, అటు పోలీస్ శాఖ క్షుణ్ణంగా పరిశీలించడం మొదలు పెట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో అక్కడక్కడా నకిలీ విత్తనాలు విక్రయిస్తుండడంతో జిల్లా విత్తన టాస్క్‌ఫోర్స్ బృందం రంగంలోకి దిగింది. ఇందులోభాగంగా శక్రవారం నెక్కొండ మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా విత్తన టాస్క్‌ఫోర్స్ బృందం నర్సంపేట ఏడీఏ దామోదర్ రెడ్డి, ఏసీపీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిఏడాది సీజన్ ముందు ప్రతీ విత్తన షాపును తనిఖీ చేస్తామన్నారు. కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతులు లేని షాపుల్లో విత్తనాలను రైతులు కొనుగోలు చేయొద్దని సూచించారు. సన్నరకం వరి విత్తనాలతోపాటు పత్తి, మొక్కజొన్న విత్తనాలు అధికంగా కల్తీవి మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలు నకిలీవి అయితే.. రశీదు ఆధారంగా రైతులకు పరిహారం అందే వీలుంటుందని, రైతులు రశీదులను పంట కాలం పూర్తయ్యేవరకు జాగ్రత్త చేయాలని సూచించారు. అనంతరం షాపుల్లోని రికార్డులు, నిల్వలు, కాలం చెల్లినవి ఏమైన ఉన్నాయా.. అనే కోణంలో తనిఖీలు చేశారు. దాడుల్లో నెక్కొండ సీఐ శ్రీనివాస్, ఏఓలు గోపాల్‌రెడ్డి, నాగరాజు, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం అభివృద్ధికి ప్రణాళిక

- డీవైఎస్‌ఓ సత్యవాణి



క్రీడాకారులతో మాట్లాడుతున్న సత్యవాణి

నర్సంపేట: మినీ స్టేడియం అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి తెలిపారు. నర్సంపేట పట్టణంలోని మినీ స్టేడియంలో నెల రోజులుగా కొనసాగుతున్న కబడ్డీ, రెజ్లింగ్ క్రీడా వేసవి శిక్షణ శిబిరాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల హాజరు వివరాలు తెలుసుకొని స్టేడియంలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మినీ స్టేడియంలో మే 1వ తేదీ నుంచి వేసవి కబడ్డీ, రెజ్లింగ్ శిక్షణ శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతిరోజు శిక్షణ శిబిరానికి హాజరవుతున్న క్రీడాకారులకు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, ప్రొఫెసర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్సార్ యూనివర్సిటీ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఈసాల లక్ష్మయ్య, స్టేడియం ఇన్‌చార్జ్, కబడ్డీ కోచ్ యాట రవికుమార్, స్టేడియం ఇన్‌చార్జ్, రెజ్లింగ్ కోచ్ మహేష్, అథ్లెటిక్స్ కోచ్ ఉరుసుల శేఖర్‌యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అకాడమీ సీనియర్ రెజ్లింగ్ క్రీడాకారుడు, పీఈటీ కుంట విజేందర్‌యాదవ్, కబడ్డీ, రెజ్లింగ్ క్రీడలకు చెందిన 80మంది క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

ఖానాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి అన్నారు. మండలంలోని ధర్మరావుపేటలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి జిమ్నాస్టిక్స్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించి, విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వేసవి శిబిరాల్లో శిక్షణ పొంది జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉంటారని, వారిని తీర్చిదిద్దితే ఉజ్వల భవిష్యత్ ఏర్పడుతుందన్నారు. క్రీడల ద్వారా శరీర ధృడత్వంతోపాటు మానసికంగా ఎదుగుతారన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశలో క్రమశిక్షణ, పట్టుదల, ఉన్నత భావాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ కోచ్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎంటీపీలో ఫైర్ సేఫ్టీ పరిశీలన

- సందర్శించిన ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్



కేఎంటీపీలోని గణేశా కంపెనీలో ఫైర్ సేఫ్టీని పరిశీలిస్తున్న డీసీపీ అంకిత్‌కుమార్, అధికారులు

గీసుకొండ: జిల్లాలోని గీసుకొండ-సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)లో నెలకొల్పిన పరిశ్రమల యూనిట్లలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా అగ్నిమాపక అధికారి రాజేశ్వర్‌రావు, మామునూరు ఏసీపీ వెంకటేశ్, గీసుకొండ సీఐ మహేందర్, ఎస్సైలు కుమార్, ప్రశాంత్‌బాబులతో కలిసి ఆయన కేఎంటీపీలోని గణేశా ఎకోటెక్ కంపెనీని పరిశీలించారు. కంపెనీలో జరుగుతున్న ఉత్పత్తి ప్రక్రియ, ఫైర్‌సేఫ్టీకి పాటిస్తున్న జాగ్రత్తల గురించి హెచ్‌ఆర్ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని రెండు పత్తి జిన్నింగ్ మిల్లులను సందర్శించి వాటిల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లోని గుల్జార్ హౌస్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం దృష్ట్యా గణేశ కంపెనీతోపాటు జిన్నింగ్ మిల్లుల్లో ఫైర్ సేఫ్టీపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

- విత్తన షాపుల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు
- విత్తన ప్యాకెట్లను పరిశీలించిన ఏసీపీ నందిరామ్, డీఏఓ అనురాధ



వరంగల్ స్టేషన్ రోడ్డులో విత్తన షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించొద్దని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ విత్తనషాపుల డీలర్లు, యజమానులకు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధతోపాటు వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ శుక్రవారం వరంగల్ స్టేషన్ రోడ్డులోని విత్తన షాపుల్లో తనిఖీలు చేపట్టారు. విత్తన షాపుల్లో నిల్వల రిజిస్టార్‌ను పరిశీలించారు. విత్తన నిల్వలు, విత్తనాల లేబుల్, ట్యాగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని ఆదేశించారు. అనుమతి లేని నాసిరకం విత్తనాలను విక్రయిస్తే పీడీ యాక్ట్ పెడుతామని హెచ్చరించారు. విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు సైతం పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఎరువులు, విత్తనాలను రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. తనిఖీల్లో ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్, ఎస్సై చాంద్‌పాషా, వ్యవసాయ అధికారి నేలకుర్తి రవీందర్, టెక్నికల్ వ్యవసాయ అధికారి సాగరిక, ఏఈఓ వంశీకృష్ణ పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయించొద్దు

నర్సంపేట రూరల్ : అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ బృందం వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని పలు విత్తన, ఎరువుల షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు అధికృత డీలర్ దగ్గరే కొనుగోలు చేయాలన్నారు. సీడ్ ప్యాకెట్స్‌పై అన్ని వివరాలు సరిగా ఉన్నాయో చూసుకోవాలని, పూర్తి వివరాలతో బిల్లు తీసుకుని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. కల్తీ విత్తనాల ప్యాకెట్లు అయితే వారిపై కేసు నమోదుచేసి నష్టపరిహారం పొందేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఎస్సై రవి కుమార్, వ్యవసాయ అధికారి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిజిస్ట్రేషన్ శాఖలో డిప్యుటేషన్ బదిలీలు

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్లతో పాటు సబ్ రిజిస్ట్రార్లకు డిప్యుటేషన్ రూపంలో స్థానం చలనం లభించింది. వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్ -1 సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న రామనరసింహారావు ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లగా, కొత్తగూడెంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రంజిత్ డిప్యుటేషన్‌పై స్టేషన్ ఘన్‌పూర్‌కు వచ్చారు. రామనరసింహారావు తిరిగి వరంగల్ ఆర్వోకు తన యథాస్థానం జాయింట్ -1 సబ్ రిజిస్ట్రార్ హోదాలో శనివారం చేరనున్నారు. అదేవిధంగా మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మరో సబ్ రిజిస్ట్రార్ పోస్టును కేటాయించగా వరంగల్ ఆర్వోలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ నస్రీన్.. మహబూబాబాద్‌కు సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు.

ప్రజాకవి కాళోజీ సినిమాకు గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు


దర్శకుడు ప్రభాకర్ జైనీ, నిర్మాత విజయలక్ష్మీ జైనీ

హన్మకొండ కల్చరల్: జైనీ క్రియేషన్స్ బ్యానర్‌లో వరంగల్‌కు చెందిన నవలా రచయిత, సినీ దర్శకుడు ప్రభాకర్ జైనీ దర్శకత్వం వహించిన, విజయలక్ష్మీ జైనీ నిర్మించిన ప్రజాకవి కాళోజీ చిత్రం గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డుకు ఎంపికైంది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ పేరున సినిమా అవార్డులు ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రజాకవి కాళోజీ చిత్రానికి గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డును ప్రకటించారు. ఈసందర్భంగా ప్రభాకర్ జైనీ హర్షం వ్యక్తం చేశారు. మంచి చిత్రాలు, సామాజిక ప్రయోజనం కోసమే చిత్రాలు తీయాలనే ఉద్దేశ్యంతోనే ప్రజాకవి కాళోజీ చిత్రం తీసినట్లు, చైతన్యవంతమైన సమాజానికి ముఖ్యకారకుడైన కాళోజీని నేటి యువతరం మరిచిపోతున్నారన్నారు. మన తెలుగు జాతి వారసత్వ సంపద కాళోజీ అని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజుకు ప్రభాకర్ జైనీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రేపు గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హన్మకొండ: ప్రతిభ కలిగిన గౌడ విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు గోపా హనుమకొండ జిల్లా గౌరవాధ్యక్షుడు, ప్రతిభా పురస్కారాల ప్రోగ్రాం కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియేట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని గౌడ హాస్టల్‌లో జూన్ 1న జరగనున్న కార్యక్రమంలో ఈ పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. పదో తరగతిలో 550 మార్కులకు పైగా, ఇంటర్‌లో 950 మార్కులకు పైగా మార్కులు వచ్చిన విద్యార్థులకు ఈ ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు వేణుగోపాల్ వివరించారు.

బోడకాకర సాగుతో నికర ఆదాయం

- ఆగాకర కాయలో ఔషధ గుణాలు, పోషక విలువలు మెండు

పాడి-పంట


బోడకాకర తోట


జినుగు మరియన్న, డీహెచ్‌ఎస్‌ఓ



మహబూబాబాద్ రూరల్: విశిష్ట ఔషధ గుణాలు, పోషక విలువలు ఉన్న ఆగాకర (బోడకాకర) సాగుతో అధిక దిగుబడి, నికర ఆదాయం వస్తుందని, చిన్న, సన్నకారు రైతులకు గొప్ప వరం లాంటిదని మహబూబాబాద్ జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. బోడకాకర సాగు, ఆదాయం, లాభాలు, ఆరోగ్య రక్షణకు ఉపయోగపడే అంశాలపై ఆయన వివరించారు.

లాభాలు :

- బోడకాకర సాగును అన్ని పంటల కంటే ముందుగానే (మే నెలలోనే) ప్రారంభిస్తారు. 2 నెలలలోనే పంట చేతికొస్తుంది. 6 నెలల వరకు దిగుబడి ఉంటుంది.
- సీజన్, డిమాండ్‌ను బట్టి కిలో రూ.80 నుంచి రూ.200 వరకు పలుకుతుంది.
- బోడకాకరలో పోషకాలు, ప్రోటీన్లు మెండుగా ఉంటాయి. ఇతర కూరగాయలతో పోలిస్తే బోడకాకర సాగు లాభదాయకం.
- ఒక ఎకరంలో 4 నుంచి 6 నెలల కాలంలో కనీసం రూ.4 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

విత్తనం ద్వారా :

- ఇది సులువైన పద్ధతి. విత్తనం మొలక 10 నుంచి 15 శాతంగా ఉంటుంది. అందులో మరలా ఆడ, మగ మొక్కలు ఉంటాయి. ఆడ మొక్కలు 15 నుంచి 20 శాతం ఉంటాయి. ఎకరాకు వరుస వరుసకు రెండు అడుగులు, పాదు పాదుకు ఒక అడుగు చొప్పున దూరంలో నాటడానికి 1,000 ఆడ మొక్కలు అవసరం అవుతాయి. దీనికి 3 వేల మొక్కలు అనగా 9 వేలు (మొలక 30 శాతం) గింజలు కావాలి. ఈ విధంగా ఎకరాకు అరకుంచం విత్తనం అవసరమవుతుంది. పొలంలో వరుస వరుసకు ఆరు అడుగులు, పాదు పాదుకు మధ్య ఆరు అడుగుల దూరంలో నాటిన స్తంభాల మధ్య వరుస వరుసకు రెండు అడుగులు, పాదు పాదుకు మధ్య రెండు అడుగుల చొప్పున 16 మొక్కలు వస్తాయి. (అనగా 36 చదరపు మీటర్లకు) ప్రతి 10 ఆడ మొక్కలకు 1 మగ మొక్కను విధిగా ఉంచుకోవాలి. దాదాపు వెయ్యి ఆడ మొక్కలకు 100 మగ మొక్కలు ఉండాలి.
- నారుమడిని వరుస వరుసకు నాలుగు అడుగులు, పాదు పాదుకు మధ్య ఒక అడుగు సైజులో, ఎత్తులో తయారు చేయాలి. 15 సెంటీ మీటర్ల వరుసల మధ్య 10 సెంటీ మీటర్ల దూరంలో విత్తనాలు విత్తాలి. వాటిపై గడ్డి వేసి పెట్టాలి. 40 నుంచి 45 రోజుల్లో మొలకలు వస్తాయి. మార్చి నెలాఖరులో నారుమడి వేస్తే, జూన్‌లో నాటుటకు తయారవుతాయి.

నాటుట :

- దుంపలను గాని విత్తనం మొక్కలను 30 నుంచి 30 సెంటీ మీటర్ల కొలతలు కలిగి పెంట ఎరువుతో నిండిన గుంతల్లో నాటుకోవాలి. నేరుగా గుంతల్లో విత్తనాలు నాటుకోవాలంటే ప్రతీ గుంతకు 10 నుంచి 15 విత్తనాలు వేస్తే 3 నుంచి 5 మొలకలు 40 నుంచి 45 రోజుల్లో వస్తాయి. అప్పుడు ఒక ఆడ తీగను ఉంచి మిగతావి వేరే చోట నాటుకోవాలి.

పంట కాలం :

- పంటకాలం మే/జూన్ నుంచి అక్టోబర్/నవంబర్ వరకు ఉంటుంది. తర్వాత తీగ చనిపోతుంది. దుంప భూమిలో సుప్తావస్థలో ఉంటుంది. మళ్లీ మే/జూన్‌లో మొలకెత్తుతుంది.
- అయితే జూన్ అక్టోబర్ మధ్యలో ఎక్కువగా పూసే ఆడ మొక్కలను, తక్కువ ఎత్తులో పూసే మగ మొక్కలను ఎంచుకోవాలి.
- సాధారణంగా ఆకులు ఒకే తమ్మెతో తీగలు ఎక్కువ దిగుబడి ఉంటుంది. 2.5 కిలోలు మొక్కకు ఇస్తుంది. అదే ఆకులు 3 నుంచి 5 తమ్మెలుగా ఉన్న తీగలు తక్కువ దిగుబడి అంటే 1.0 నుంచి 1.5 కిలోలు మొక్క ఇస్తుంది.
- అదే విత్తనమైతే ప్రతి గుంతలో 10 నుంచి 15 విత్తనాలు వేయాలి.
- అందులో నుంచి 3 నుంచి 5 పిలుకలు / మొక్కలు 40 నుంచి 45 రోజుల్లో వస్తాయి.

పందిరి :

- భూమికి 4 నుంచి 6 అడుగుల ఎత్తులో కొబ్బరి తాడు / జీఐ వైరుతో పందిరి ఏర్పాటు చేసుకోవాలి. తీగలను అంతటా పాకించాలి. లేదా ప్రతి మొక్క రెండు పాదలు ఏర్పాటు చేసుకుని తీగలను అల్లించవచ్చు.

దిగుబడి :

- బోడకాకరను సాధారణంగా వెజిటబుల్ చికెన్ అని అంటారు. పంట 45 నుంచి 50 రోజుల్లో పూతకు వస్తుంది. పూత నుంచి కాయ కాయడానికి వారం రోజులు పడుతుంది. వారానికి రెండు సార్లు కోతకు వస్తుంది. ప్రతి కోతకు ఎకరం 40 నుంచి 50 కిలోలు వస్తాయి. సాధారణంగా 15 నుంచి 20 కిలోలు ఎకరానికి దిగుబడి వస్తుంది.
- ఆగస్టు నుంచి అక్టోబరు చివరి దాకా కాయలు వస్తాయి. ఆపై తీగలు ఎండిపోతాయి. మరల మరుసటి సంవత్సరం తొలకరికి దుంపలు చిగురిస్తాయి. వారానికి రెండు సార్లు కోత వస్తుంది. ప్రతి కోతకు 40 కిలోల కాయలు వస్తాయి. 8 నుంచి 10 క్వింటాళ్లు ఎకరాకు, అధిక దిగుబడికి మొదటగా బ్రష్‌తో మగ పూల నుంచి పుప్పొడి సేకరించి, ఉదయం వేళలో ఆడ పూలపై అద్దాలి.
- వెదురు బుట్టల్లో అడుగున ఎండుగడ్డి వేసి, కాయలతో నింపి తడి గోనె సంచిలో కప్పి ప్యాకింగ్ చేసి దూరం ప్రాంతాలకు మార్కెట్ చేస్తారు. కాపు అనంతరం నవంబరు నుంచి నీరు పెట్టరాదు. నిద్రావస్థలో వుంచాలి. మరలా మే నుంచి మొలకలు వస్తాయి.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా ఉండే బోడకాకరలో విశిష్ట ఔషధ గుణాలు, పోషక విలువలు ఉన్నాయి. దీంతో మార్కెట్లో డిమాండ్ ఉండి కిలో రూ.80 నుంచి రూ.200 ధర పలుకుతోంది. ఉద్యాన రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి.

రోగ నిరోధక శక్తి పెంపు

ప్రస్తుత వాతావరణ మార్పులు, పరిస్థితులు, ఆరోగ్య సంరక్షణ, డెంగీ, కరోనా, పలు వైరసుల వల్ల కలిగే అనారోగ్య లక్షణాల నుంచి సంరక్షణకు, రోగ నిరోధక శక్తి పెరగాలంటే అధిక పోషకాలు, ఔషధ గుణాలు ఉన్న ఆగాకర (బోడకాకర) చాలా ముఖ్యం.బోడకాకర ఏక పంటగా, అంతర పంటగా, బోర్డర్ పంటగా, టెర్రస్ (మిద్దె) తోటగా, ఇంటి ఆవరణంలో పెంచుకోవచ్చు. ఒకప్పుడు ఈ తీగజాతి పంట, అటవీ ప్రాతంలో సహజసిద్ధంగా పండేది. రానురాను ఈ పంటకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. దాంతో రైతులు ఈ పంటను చిన్న చిన్న కమతాల్లో సాగు చేసుకుంటున్నారు.

ముఖ్యాంశాలు

- తప్పనిసరిగా ప్రతి 10 ఆడ మొక్కలకు, ఒక మగ మొక్క చొప్పున నాటుకోవాలి.
- మగపూల నుంచి సేకరించిన పుప్పొడిని మెత్తటి బ్రష్‌తో తీసుకొచ్చి ఆడపూలపై అద్దితే ఎక్కువ దిగుబడి వస్తుంది.
- వర్షాకాలంలో వర్షపాతం తక్కువైనప్పుడు 10 రోజులకోసారి తేలికపాటి తడులు ఇవ్వాలి.

రాయితీలు

- రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం నుంచి పందిరి సాగుకు రూ.50 వేల రాయితీ ఉంది.

రాయబంధంలో మావోయిస్టు సభ్యురాలికి చికిత్స

- రెండు రోజుల్లో ఎస్పీ ఎదుట హాజరు


రాయబంధంలో ఉన్న చిట్టి

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రాయబంధంలో మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు మడకం చిట్టి అలియాస్ కీడో రహస్యంగా చికిత్స పొందుతోంది. ఇటీవల కర్రెగుట్టలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమె ఎడమ కాలుకు బుల్లెట్ తగలడంతో ములుగు జిల్లా చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధిలోని రాయబంధం గొత్తికోయగూడెనికి చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు లొంగిపోయేందుకు ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా, ఆమె కాలుకు గాయం కావడంతో చికిత్స కూడా చేయిస్తున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు దామోదర్ రక్షణ స్థాయిలో పనిచేసే సెంట్రీగా ఆమెను పోలీసులు భావిస్తున్నారు. చిట్టి అరెస్టును పోలీసులు మరో రెండు రోజుల్లో చూపెట్టి ఎస్పీ ఎదుట హాజరుపర్చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ విషయాన్ని పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు.

అనామక ఫిర్యాదులపై విచారణ

హన్మకొండ: అనామక ఫిర్యాదులపై సీవీసీ నిబంధనల ప్రకారం ప్రాథమిక విచారణ చేపట్టిన తర్వాత, అందులో వాస్తవాలు నిర్ధారణ అయితేనే శాఖా పరమైన చర్యలు చేపడుతామని టీజీ ఎన్పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ చీఫ్ ఇంజనీర్ టి.మధుసూదన్ స్పష్టం చేశారు. యాజమాన్యానికి వచ్చే అనామక ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, ఆరోపణల్లో ప్రాధాన్యం ఉంటే సీవీసీ నిబంధనల ప్రకారం విచారణ చేపట్టడానికి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌కు పంపిస్తామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజిలెన్స్ విచారణలో వెలుగు చూసే అంశాల ఆధారంగా చర్యలుంటాయని తెలిపారు. విచారణలో ఆరోపణలు అవాస్తవాలు అని నిరూపితమైతే ఎలాంటి శాఖాపరమైన చర్యలుండవని తెలిపారు. ఆరోపణలు వాస్తవమని నిరూపితమైతేనే చర్యలు తీసుకుంటామని వివరించారు.

'ఉపాధి' వేతన బకాయిలు విడుదల చేయాలి


హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, ఉపాధి కూలీలు

- పట్టణ పేదలకు ఉపాధి పని కల్పించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రాములు

హన్మకొండ అర్బన్: గ్రామీణ ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలను విడుదల చేయాలని, పట్టణ పేదలకు ఉపాధి పని కల్పించాలని, రోజు కూలి రూ.600లు, 200 రోజుల పనిదినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాములు డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీఏ హయాంలో వచ్చిన గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఎత్తివేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. పట్టణాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల ఏర్పాటు పేరుతో గ్రామాలను విలీనం చేసి లక్షలాది మందిని ఉపాధి పనికి దూరం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని పేర్కొన్నారు. ధర్నా కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గొడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అంబాల స్వరూప, లోకిని స్వరూప, వేలు రజిత, చిలుక రాఘవులు, అజ్మీరా భిక్షపతి, మనీషా చందు, నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

'సీకేఎం' వైద్యుల నిర్లక్ష్యం


నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

ఎంజీఎం: వరంగల్ సీకేఎం ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం.. బాలింత ప్రాణం మీదికి వచ్చింది. బాధితురాలి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం వరంగల్ కాశికుంట ప్రాంతానికి చెందిన నజియా భాను ప్రసూతి సేవల కోసం సీకేఎంలో ఈనెల 25న రాత్రి చేరారు. రాత్రి సుమారు నాలుగు గంటలు శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు బాబు జన్మించినట్లు తెలిపి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆరు రోజులు బాలింతను కుటుంబ సభ్యులకు చూపించకుండా వైద్య సేవలు కొనసాగుతున్నట్లు చెబుతూ వచ్చారు. శుక్రవారం ఉదయం నజియా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఎంజీఎంకు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ కేస్ షీట్ అందించాలని కోరారు. కేస్ షీట్ పోయిందని, కొత్తది రాసిస్తామని చెప్పడంతో కుటుంబసభ్యులు ఖంగుతిన్నారు. నజియా బేగంను వెంటనే చూపించాలని పట్టుబట్టారు. అప్పటికే నజియా బేగం పొట్టభాగం విపరీతంగా ఉబ్బి ఉండడంతో వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆస్పత్రి భవనం ఎదుట ధర్నా చేసి నిరసన తెలిపారు.

రేపు టీజీ ఎడ్‌సెట్

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5,360 మంది అభ్యర్థులు
- 9 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో బీఈడీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరం 2025 – 2026లో ప్రవేశాలకు టీజీఎడ్‌సెట్ – 25ను జూన్ 1న కాకతీయ యూనివర్సిటీ నిర్వహించనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో ఎర్రగట్టు గుట్ట ప్రాంతంలోని ఐయాన్ డిజిటల్, హనుమకొండలోని జయ ఇన్‌స్టిట్యూట్, మోక్షిత్ కంప్యూటర్స్ ఇన్‌స్టిట్యూట్, నోబెల్ టెక్నాలజీ (హసన్‌పర్తి), బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల, హసన్‌పర్తిలో సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, వరంగల్‌లోని ఎస్‌ఎస్ టెక్నాలజీ ఉన్నాయి. అలాగే, నర్సంపేటలోని లక్నెపెల్లి ప్రాంతంలోని బిట్స్‌లో ఒక పరీక్ష కేంద్రం ఉంది. మొత్తం 5,360 మంది ఆన్‌లైన్‌లో పరీక్ష రాయనున్నారు. 9 పరీక్ష కేంద్రాలకు 9మంది అబ్జర్వర్లను నియమించారు. రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. మొదటి సెషన్ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరగనుంది. ఉదయం 9.30గంటల వరకే అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలోకి అనుమతిస్తారు. ఆ తరువాత గేట్లు మూసివేస్తారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటలవకు రెండో సెషన్ జరగనుంది. మధ్యాహ్నం 1.30 గంటల వరకే పరీక్ష కేంద్రాలోకి అనుమతిస్తారు. ఆ తరువాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్, కేయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి సూచించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు, బ్లూపెన్ లేదా బ్లాక్ పెన్‌ను తెచ్చుకోవాలని అన్నారు.

ఆ సినిమాలకు అవార్డులు తిరస్కరించాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

న్యూశాయంపేట: పుష్ప -2 సినిమాలో స్మగ్లర్ పాత్ర పోషించిన అల్లు అర్జున్‌కు, రజాకార్ సినిమాకు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డులను తిరస్కరించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకుడు మోతె లింగారెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సమావేశంలో శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను అవమానపరుస్తూ తీసిన రజాకార్ సినిమాకు ఉత్తమ చారిత్రక వారసత్వ సినిమా అవార్డు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి, మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాల భూములను పంచిపెట్టిన చరిత్ర ఎర్రజెండా పార్టీకే దక్కిందని గుర్తు చేశారు. ఆనాడు పటేల్ సైన్యాలతో గ్రామాలపై విరుచుపడి ప్రజలపై కాంగ్రెస్ పార్టీ దాడి చేసి చంపించిందని, నేడు అదేతీరుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ తీసిన సినిమాలకు ఉత్తమ సినిమా అవార్డులు ఇవ్వడం అమరవీరులను అవమానపరచడమే అని అన్నారు. అలాగే మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావజాలాన్ని పెంపొందిస్తూ వచ్చిన కల్కి సినిమాకు కూడా ఉత్తమ సినిమా అవార్డు రావడం భారత సమాజాన్ని మూఢ విశ్వాసాల వైపు తీసుకెళ్లడమేనని చెప్పారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యురాలు మండ సదాలక్ష్మి, ఎన్.అశోక్ స్టాలిన్, డాక్టర్ మార్క శంకర్ నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులు మంచాల రమాదేవి, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, జక్కు రాజుగౌడ్, బత్తిని సదానందం పాల్గొన్నారు.

ప్రజల్లో ధైర్యం కల్పించేందుకే కవాతు

- ఏడు రోజుల పాటు కార్యక్రమాలు
- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్


జెండా ఊపి కవాతు ప్రారంభిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

హసన్‌పర్తి: ప్రజల్లో ధైర్యం కలిగించేందుకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సన్‌ప్రీత్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఊపి కవాతు ప్రారంభించారు. హనుమకొండ బస్టాండ్, బ్రాహ్మణవాడ, అలంకార్ జంక్షన్, చౌరస్తా మీదుగా అశోక్ జంక్షన్ వరకు కవాతు సాగింది. అనంతరం కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ.. కేంద్రహోం శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈకార్యక్రమం ఏడు రోజులు కొనసాగుతుందన్నారు. కమిషనరేట్ పరిధి వివిధ పోలీస్‌స్టేషన్లలో కవాతు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎలాంటి అల్లర్లు, మత ఘర్షణ తలెత్తినా తక్షణమే స్పందించి స్థానిక పోలీసులకు సహకారం అందిస్తూ ప్రజలకు శాంతి భద్రతలపై భరోసా కల్పించడమే లక్ష్యంగా కవాతు నిర్వహిస్తున్నట్లు సీపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఆర్‌ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సరస్వతి, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ సతీష్, రవికుమార్, సత్యనారాయణరెడ్డితో పాటు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి సంగమం వద్ద పెరిగిన నీటిమట్టం



కాళేశ్వరంలో పెరిగిన నీటిమట్టం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద నీటిమట్టం పెరిగింది. ఇటీవల ఎగువన అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో గోదావరి, ప్రాణహిత నదుల్లో నీటిమట్టం పెరుగుతోంది. శుక్రవారం 3వేల క్యూసెక్కుల ప్రవాహం దిగువకు తరలిపోతోంది. గత వారం 1,800 – 2,200 క్యూసెక్కుల వరకు ప్రవాహం తరలిపోయింది. - కాళేశ్వరం

బొగత జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



బొగతలో పర్యాటకుల సందడి

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతాన్ని చూసేందుకు పర్యాటకులు శుక్రవారం తరలివచ్చారు. అడపాదడప కురుస్తున్న వర్షాలకు గుట్టలపైనున్న వాగు పొంగడంతో ఆ నీరు బొగతకు వచ్చి చేరుతోంది. దీంతో జలపాతం వద్ద కనువిందు చేస్తున్న జలధారలను వీక్షించేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు. - వాజేడు